క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం


చెస్ ఆడుతున్న విద్యార్థులు

పూతలపట్టు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం, ఆరోగ్యంగా ఉంటుందని ప్రధానోపాధ్యాయులు మనోహర్ అన్నారు. నియోజకవర్గ స్థాయి ఎస్‌జీటీ క్రీడా పోటీలను ప్రధానోపాధ్యాయులు మనోహర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయి జట్టుకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి కృష్ణయ్య, ఢిల్లీరాణి, కృష్ణమూర్తి, లోకనాథరెడ్డి, మోహన్,హరి, అరుణ్, వెంకట్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బంగారుపాళెం: మండలంలోని నలగాంపల్లెలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెరటాసి నెల మొదటి శనివారం సందర్భంగా స్వామి వారికి ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సతీ సమేతుడైన స్వామివారి మూలవర్లను విశేషంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు.

28 నుంచి కీలపట్లలో పవిత్రోత్సవాలు

తిరుపతి(అలిపిరి): కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామివారి ఆలయంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు శనివారం టీటీడీ అధికారులు తెలిపారు. 27న సాయంత్రం పుణ్యాహవచనం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. 28వ తేదీ రక్షబంధనం, పవిత్ర ప్రతిష్ఠ, శేయాధివాసం, 29న ఉదయం స్నపన తిరుమంజనం, పవిత్ర సమర్పణ, సాయంత్రం పవిత్ర హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. 30న ఉదయం హోమాలు, సాయంత్రం మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భక్తి సంగీతం, హరికథ, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజనలు నిర్వహించనున్నారు.

అనుమతి లేకుండా టపాసుల విక్రయంపై కేసు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తున్న గిరీష్‌పై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, నగరంలో పలుచోట్ల అనుమతులు లేకుండానే టపాసులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో తమ సిబ్బందితో కలిసి శనివారం బజారు వీధిలోని పలు దుకాణాల్లో తనిఖీ చేశామన్నారు. గిరీష్ అనే వ్యక్తి తన కిరాణా దుకాణంలో టపాసులు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్టు తెలిపారు. రూ.82 వేల విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వందరోజులు.. హామీలు హాంఫట్

- కూటమి పాలన ప్రచారానికే పరిమితం
- సూపర్ సిక్స్ పేరుతో మోసం
- నియోజకవర్గంలో విమర్శల వెల్లువ


మరమ్మతుకు నోచుకోని యాదమరి మండలంలో పరదరామికి వెళ్లే రోడ్డు

కాణిపాకం: ఎన్నికల వేళ మోసపూరిత హామీలను గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని బీరాలు పలికారు. తీరా అధికారంలోకి వచ్చాక కూటమి ప్రజాప్రతినిధులు ప్రజలను వంచించారు. హామీల అమలుపై దృష్టి సారించలేదు. కనీసం వాటిపై సమీక్షించి కార్యాచరణను రూపొందించిన దాఖలాలు లేవు. అయినా వందరోజుల పాలనపై మంచి ప్రభుత్వం అంటూ ఆ పార్టీ నేతలే స్వయంగా ప్రచారం చేసుకోవడంపై ప్రజలు విమర్శల వర్షం గుప్పిస్తున్నారు.

ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదు. ఓటేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేద ప్రజలను నమ్మించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకంటే రెండింతలు ఇస్తానంటూ చంద్రబాబు చేసిన హడావుడి ప్రజల కళ్లముందు ఇంకా కదలాడుతూనే ఉంది. కూటమి నేతలంతా బాబు ష్యూరిటీ..భవిష్యత్‌కు గ్యారంటీ అంటూ ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టి వందరోజులైనా కూటమి ప్రభుత్వం నుంచి ప్రజలకు మొండి చేయే కనిపిస్తోంది.

పూతలపట్టు నియోజకవర్గంలో టీడీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన మురళీమోహన్ సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేసి, ప్రజలను ఓట్లడిగి వేయించుకున్నారు. ఇటు చంద్రబాబు, అటు పవన్‌కల్యాణ్‌తోపాటు నియోజకవర్గాల్లో కూటమి నాయకుల మాటలను విశ్వసించిన ప్రజలు ఆయనకు పట్టం కట్టారు. అధికారం కోసం కూటమి నాయకులంతా, బడికి వెళ్లి చదువుకునే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద రూ.15వేలు, నిరుద్యోగ భృతిగా యువతకు నెలకు రూ.3వేలు, 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 తదితర పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులవుతున్నా, హామీల అమలుకు సంబంధించిన విధి విధానాలను నేటికీ ఖరారు చేయలేదు. ఒక్క హామీని అమలు చేయలేదు. మరోవైపు హామీల అమలు భయమేస్తోందంటూ కొత్త పల్లవిని అందుకున్నారు. ఈ తరుణంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తారనే ఆశ ప్రజల్లో క్రమంగా సన్నగిల్లుతోంది. ఇక చంద్రబాబు హామీలను పక్కన పెడితే స్థానికంగా టీడీపీ తరపున బరిలో దిగి గెలిచిన ప్రజాప్రతినిధులు హామీలు తుస్సుమనిపించాయి.

ఎమ్మెల్యే మురళీమోహన్ హామీలు ఇలా..

ఓట్లు దండుకోవడమే లక్ష్యంగా టీడీపీ ఎమ్మెల్యేలు ప్రచార ఆర్భాటలు చేశారు. నియోజకవర్గాన్ని అది చేస్తాం..ఇది చేస్తామని ప్రచారం చేసి తీరా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వంద రోజులు గడిచినా ఎన్నికల హామీలను మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ కారణంగా నియోజకవర్గంలో ప్రధానమైన సమస్యలు తీరాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అభివృద్ధి పనులు చేపట్టడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సొంత పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

- ఐరాల మండలంలో రైతుల కోసం చెక్‌డ్యాంలు ఏర్పాటు చేస్తాం. రజకులకు దోబీఘాట్, ఎస్సీ ఎస్టీ మహిళలకు జీవనోపాధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు. బీసీల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక నిధులు తెప్పిస్తామంటూ హామీలు గుప్పించారు.
- తవణంపల్లె మండలంలో మామిడి ధరలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. పంట నిల్వలకు కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేపడతాం. పండ్లగుజ్జు పరిశ్రమ ఏర్పాటు చేసేలా చూస్తాం. ఎస్సీ, ఎస్టీ హాస్టల్ ఏర్పాటు చేస్తామని బలంగా హామీ ఇచ్చారు.
- యాదమరి మండలం నుంచి తమిళనాడులోని పరదరామికి వెళ్లే రోడ్డును అభివృద్ధి చేస్తామని ప్రజా సమక్షంలో హామీ ఇచ్చారు.
- పూతలపట్టు మండల కేంద్రంలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తానని, పూర్తి స్థాయిలో తాగు నీటి సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. తీరా వంద రోజులు గడిచిన ఆ హామీలు గాలిలో దీపంలా మారాయి.
- అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. శ్మశాన వాటిక సమస్యలు తీరుస్తానన్నిప ప్రగల్భాలు పలికారు. వంద రోజులు గడిచినా ఆ హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే జనం రోడ్డెక్కే పరిస్థితులు కల్పిస్తున్నాయి.

చంద్రబాబు ఏమన్నారంటే..

అంగళ్లు ఘటన జరిగిన రాత్రి పూతలపట్టు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభకు చంద్రబాబు హాజరయ్యారు. చామంతిపురం ప్రాజెక్టును పూర్తి చేసి పూతలపట్టు నియోజకవర్గానికి నీటి కష్టాలను తీరుస్తామని హామీ ఇచ్చారు. పంట పొలాలకు పూర్తి స్థాయిలో నీరు అందిస్తామన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తానని గట్టిగా హామీ ఇచ్చారు.

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు..

- టీడీపీ అధినేత ఇచ్చిన హామీలతో పాటు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు సైతం పలు హామీలను ఎన్నికల సమయంలో వెల్లడించారు.
- పూతలపట్టు నియోజకవర్గానికి ప్రధానంగా బంగారుపాళ్యం అటవీ ప్రాంతం మీదుగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తానన్నారు.
- అటవీ ప్రాంతాల్లో కందక పనులు చేపడతామని హామీ ఇచ్చారు. తద్వారా ఏనుగు దాడులను కట్టడి చేస్తానని హామీల వర్షం కురిపించారు.
- ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాకంలో వేద పాఠశాల నిర్మిస్తామని మాట ఇచ్చారు.
- కాణిపాకంలో అత్యంత ఆధునీకరణ సదుపాయాలతో ఆస్పత్రి నిర్మాణం చేపడతామని అప్పట్లో హామీలు గుప్పించారు.

ఆలయాల్లో మార్మోగిన గోవింద నామస్మరణ


గోవిందరాజుల గుట్టలో పాద ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం టి.వేపనపల్లి సమీపంలోని గోవిందరాజుల గుట్టలో శనివారం నూతన దశావతారాల విగ్రహ ప్రతిష్ఠ, శ్రీవారి పాదాల ప్రతిష్ఠ చేశారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠ పూజలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. సాయంత్రం పెరటాసి నెలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో గుట్ట గోవింద నామస్మరణలతో మార్మోగింది.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో...

చిత్తూరు నగరం ఈశ్వరగుడి వీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పెరటాసి పూజలను నిర్వహించారు. పెరటాసి నెల మొదటి శనివారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో స్వామి దర్శనం కోసం క్యూకట్టారు. ఆలయ ఆవరణలో కర్పూర హారతి వెలిగించి ప్రదక్షిణలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం కూడా భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

ఆధునికతకు ఆద్యుడు గురజాడ


విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న ఉషారాణి

చిత్తూరు కలెక్టరేట్: తెలుగు భాషా సాహిత్యంతో, సామాజిక చైతన్యం తీసుకొచ్చిన మహాకవి గురజాడ అప్పారావు అని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డా.ఉషారాణి అన్నారు. నగరంలోని ఆ కళాశాలలో శనివారం గురజాడ జయంతి వేడుకలు నిర్వహించారు. డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ రాజు నుంచి రోజు కూలీ వరకు సమకాలీనులను తన సాహిత్యంతో గురజాడ అప్పారావు అమితంగా ప్రభావితం చేశారన్నారు. ఆయనకు నవయుగ వైతాళికుడు అన్న పేరు కూడా ఉందని గుర్తుచేశారు. స్త్రీలను తొక్కిపెట్టే నాటి శిథిల సమాజంపై కన్యాశుల్కం నాటకంతో అగ్నివర్షం కురిపించిన కలం యోధుడని చెప్పారు. హిందీ అధ్యాపకురాలు షమ్స్ అక్తర్ మాట్లాడుతూ గురజాడ రచించిన రచనలు నేటికీ సమకాలీనతను, ప్రాసంగికతను కలిగి ఉన్నాయన్నారు. తెలుగు అధ్యాపకులు దక్షిణామూర్తి మాట్లాడుతూ గురజాడ తెలుగుజాతి హృదయాల్లో శాశ్వతంగా జీవిస్తున్న ధన్యుడని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబ్జాదారుకు వత్తాసుపై ఆగ్రహం


ఎమ్మెల్యే థామస్‌తో వాగ్వాదానికి దిగిన నేతలు

కార్వేటినగరం : భూకబ్జాలకు పాల్పడుతున్న వారికి ప్రాధాన్యమిస్తుండడంపై టీడీపీ నేతలు మండిపడ్డారు. శనివారం ఎస్ఆర్ పురం మండలం నెళవాయిలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమలంలో ఎమ్మెల్యే థామస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 3.5 ఎకరాల చెరువు భూమిని ఆక్రమించిన జనసేన నేత లోకనాథరెడ్డికి ఎమ్మెల్యే థామస్ వత్తాసు పలుకుతున్నారని స్థానిక టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. కబ్జాలకు స్థానమేలేదని చెబుతూ, చుట్టూ వాళ్లనే పెట్టుకోవడం సరికాదని స్పష్టం చేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


రికవరీ ఫెసిలిటీ సెంటర్‌ను పరిశీలిస్తున్న నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని గిరింపేట మున్సిపల్ హైస్కూల్ పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ శుభ్రత కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శుభ్రతపై మిగిలిన వారికి అవగాహన కల్పించాలని సూచించారు. నిత్య జీవనంలో ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం వల్ల భావి తరాలకు మంచి వాతావరణాన్ని అందివ్వగలమన్నారు. చివర్లో విద్యార్థుల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు గంగినేనిచెరువు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఉన్న పిచ్చి మొక్కలు, వ్యర్థాలు తొలగించారు. అనంతరం కమిషనర్ నగరంలోని మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్, కంపోస్ట్ యార్డులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, హెచ్ఎం రమేష్ బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, నరసింహ, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

అవధాన సామ్రాజ్యం ఆంధ్రుల సొంతం


అష్టావధానంలో పాల్గొన్న సభ్యులను సత్కరించిన పాఠశాల యాజమాన్యం

చిత్తూరు కలెక్టరేట్: అవధాన సామ్రాజ్యం ఆంధ్రుల సొంతమని అవధాని మల్లెల నాగరాజు అన్నారు. నగరంలోని సంతపేటలో ఉన్న బృందావనం పాఠశాలలో శనివారం అష్టావధానం కార్యక్రమం నిర్వహించారు. హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకట్టుకుంది. అవధాని మాట్లాడుతూ అవధానం అనే సాహిత్య ప్రక్రియ తెలుగు వారి సొత్తు అని అన్నారు. అవధానం చేయడం కత్తిమీద సాములాంటిదన్నారు. హరివిల్లు అధ్యక్షులు భాస్కరరెడ్డి మాట్లాడుతూ నేటి యువత అవధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అవధానం విశిష్టత నేటి భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కరస్పాండెంట్ శైలజకుమారి మాట్లాడుతూ తెలుగుభాషకు వన్నె తెచ్చిన సాహిత్య ప్రక్రియ అవధానమని అన్నారు. అవధాన ప్రక్రియను మొట్టమొదట మాడభూషి వెంకటాచార్యులు ప్రవేశపెట్టారని చెప్పారు. అనంతరం అవధానంలో పాల్గొన్న వారిని దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు విజయభాస్కరరావు, డైరెక్టర్ ప్రియతేజ, సభ్యులు గోవిందన్, మునస్వామి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కుసుమకుమారి

ఐరాల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యం బాగుటుందని ఈఓపీఆర్డీ కుసుమకుమారి అన్నారు. మండలంలోని చినకాంపల్లె, నాంపల్లె పంచాయతీల్లో శనివారం స్వచ్ఛతా హీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ట్యాంకులు వద్ద, రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛతా హీ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు ఉంటుందని తెలిపారు. పంచాయతీల్లో ఆరోగ్య సంరక్షణ సేవలు, బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు మందుల పిచికారీ, చెత్త డంపులను తొలగించడం, మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. విద్యుత్, నీరు ఆదాతోపాటు, ప్లాస్టిక్ నిరోధంపై అవగాహన కల్పిస్తూ, తాగునీరు శుభ్రంగా ఉంచేందుకు వాటర్ ట్యాంకులు క్లీనింగ్, క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చిరంజీవి, బేబీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి ప్రత్యేక పుష్పాలంకరణ



ఆలయంలో విశేష పత్రపుష్పాలంకరణ



పుష్ప శోభితం !



ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలో శనివారం జరిగిన వరసిద్ధి వినాయక స్వామి పుష్పపల్లకి ఉత్సవానికి ఆలయం పుష్ప శోభితమైంది. విదేశీ పుష్పాలు, ఫలాలతో ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అన్వేటి మండపం, ధ్వజస్తంభం, ఆలయ పరిసరాలు, సుపథ మండపం, ఆలయ విమాన గోపురాన్ని ముస్తాబు చేసి పుష్పతోరణాలు కట్టారు. ఆలయ ముఖద్వారం నుంచి గోపురం వరకు పుష్పాలంకరణలు కనువిందు చేశాయి.

–కాణిపాకం





సాంస్కృతిక సంబరం



కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. నాటకాలు, గీతాలాపనలు, కూచిపూడి, భరతనాట్యం కళాకారుల ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. హారిక ధార్మికోపన్యాసాన్ని భక్తులు ఆసక్తిగా ఆలకించారు. అనంతరం కళాకారులకు ఆలయ అధికారులు బహుమతులు ప్రదానం చేశారు.













